# చిలక హంస

'ఏమ్మారత్తీ! వొంట్లో బాగులేదా?' అని అడిగాడు శివయ్య.

ఆ వెంటనే 'వొంట్లో బాగున్నట్టులేదు. రెండ్రోజులుగా చూస్తున్నా కదా! మందకొడిగా నీరసంగా ఉంటున్నది. ఏమిటో సంగతి....' అనుకున్నాడు కూడా.

ఉదయవేళ.... ఎదురుగా ఇళ్ళ కప్పుల మీదినుంచి సూర్యబింబం ఎర్రగా.... నిప్పు ముద్దలా ఉదయిస్తున్నది. ఇవాళ ఆలస్యంగా వస్తున్నాడు సూర్యుడు. రాత్రల్లా చిక్కగా వ్యాపించిన మంచుతెరలు నెమ్మది నెమ్మదిగా విడిపోతున్నాయి. ఇవాళ సూర్యుడితో పాటే రైలు కూడా అరగంట ఆలస్యంగా వచ్చింది. రైలంతా తేనె తుట్టెలాగున కిటకిట లాడుతున్నది. కాలు పెట్టేందుకు కూడా చోటు దొరకలేదు. అరనిముషం సేపు కూడా రైలాగదు ఆ చిన్న స్టేషనులో.... తన సరంజామాతో అటూ ఇటూ ఆదుర్దాగా పరుగులెత్తి ఎలాగైతేనేం ఒక పెట్టెలో చొరబడగలిగాడు. కేవలం అరగంట మాత్రమే ప్రయాణం. అయినా ఆ కాస్సేపటిలోనే ఉన్న ఒక్క కాలూ తిమ్మిరెక్కింది. ఒంటికాలి ఆసరాతో అలా నిలబడవలసి వచ్చింది. చీకట్లు నెమ్మది నెమ్మదిగా విచ్చుకుని పుందమైన వెలుతురు వ్యాపిస్తుండగా 'దణ దణ'మని చప్పుడు చేసుకుంటూ రైలు నది వంతెన మీదికి వచ్చింది. ఆ తరువాత రెండు నిము షాలలోనే ఈ మహాపట్నం యొక్క అతి పొడవైన ప్లాట్‌ఫారం మీద ఒక మూల

వెళ్ళి ఆగింది రైలు. కిందికి దిగి, చేతికర్ర ఆసరాగా ఒక గోడ దరికి వెళ్ళి అక్కడ కాసేపు తన సామాను ఉంచుకుని గోడ కానుకుని నిలబడ్డాడు. ఏ క్షణంలో ఎవరు వచ్చి టిక్కెట్టు అడుగుతారో అని లోపల మహాబెంగ.... నెమ్మదిగా ఆ భయం తీరి అంతా మోసుకుని, కర్ర భుజం క్రింద ఉంచుకుని ఇవతలికి నడిచాడు. స్టేషన్‌లో ఎన్ని వంతెనలు.... ఎన్ని మెట్లు.... బిక్కు బిక్కుమంటూ స్టేషన్‌లో టికెట్ అడిగేవాళ్ళను ఏమార్చి ఇవతలికి వచ్చాడు. ఈ మహాపట్నం తనకు బాగా తెలుసు. చాలా కాలంగా తాను దాదాపు రోజువిడిచి రోజు ఇక్కడికి వస్తున్నాడు. ఇక్కడికి రాని రోజు మరోవైపుకు, మరో ఊరికి....

ఇంకా వీథుల్లో జన సంచారం ముమ్మరం కాలేదు. ఈ పట్నాలింతే.... మనుషులు నెమ్మదిగా నిద్ర లేస్తారు. నెమ్మదిగా తూగుతూ, జోగుతూ పనులు చేసుకుంటారు. ఆ తరువాత మరింత నెమ్మదిగా పనులకు బయలుదేరుతారు. శివయ్య మళ్ళీ పక్కకు చూస్తూ - 'దీనికి ఒంట్లో బాగున్నట్టులేదు' అనుకున్నాడు. ఎందుకో ఉన్నట్టుండి ఒక విచిత్రమైన దిగులు మనసంతా ఆవరించింది. కాని అంతలో హుషారు తెచ్చుకొనేందుకు బనీను జేబులోంచి బీడీ కట్ట ఇవతలికి తీశాడు. సరికొత్త కట్ట.... అంతకుముందే ఈ పేవ్‌మెంట్ మీద సరంజామా సర్దుకొని కూర్చునేముందు ఎదురుగా వెళ్ళి టీ బంకులో స్ట్రాంగ్ టీ తాగి, ఈ బీడీ కట్టకొన్నాడు. ఇప్పుడు దాన్ని రెండు అరచేతుల మధ్య ఉంచుకొని అటూ ఇటూ నలిపి అప్పుడు అతి జాగ్రత్తగా ఒక బీడీ ఇవతలికి తీసి దాన్ని జాగ్రత్తగా వెలిగించుకున్నాడు రెండో అగ్గిపుల్ల అవసరం రాకూడదన్నంత పట్టుదలతో. బీడీ చురచురమని వెలిగింది. ఆపొగ గుండెలోకి వెళ్ళగానే ఒక రకం వెచ్చదనం వచ్చినట్టనిపించి కొంచెం దగ్గి సర్దుకు కూర్చున్నాడు.

ఎదురుగా బస్సులు వస్తూ పోతూ ఉన్నాయి. జనసంచారం ఆరంభమైంది. మానవ పాదాలు చకచక నడుస్తూ పోతున్నాయి. స్కూళ్ళకు వెళ్ళే పిల్లలు గుసగుస నడుచుకుంటూ పోతున్నారు.

ఒకడూ అరా బొత్తిగా పనిలేనివాళ్ళు పేవ్‌మెంట్ మీద నెమ్మదిగా నడుస్తున్నవాళ్ళు ఒక్క క్షణం ఆగి అతని వంకా, అతని ముందున్న సరంజామా వంకా కుతూహలంగా చూసి వెళ్ళిపోతున్నారు.

అంతలో ఇద్దరు యువకులు అక్కడ ఆగారు శివయ్య బీడీ అవతల పారేసి వారిని చూసి నవ్వాడు.

వాళ్ళలో ఒకడు 'రారా వెళదాం....టైమవుతున్నది' అన్నాడు.

రెండోవాడు 'ఆగాగు.... ఒక్క నిముషం....' అని శివయ్య వంక తిరిగి 'ఎంత తీసుకుంటావు?' అని అడిగాడు.

'రూపాయి సార్....అంతే' అన్నాడు శివయ్య.

ఆ యువకుడు 'ఏమైనా అడగవచ్చా?' అని అడిగాడు.

శివయ్య తల ఊపి 'మీ ఇష్టం ఏదైనా అడగవచ్చు' అన్నాడు.

ఆ యువకుడు కూర్చున్నాడు. జేబులోనుంచి రూపాయి తీసి ఇచ్చాడు.

శివయ్య దాన్ని అందుకుని కళ్ళ కద్దుకుని ముద్దుపెట్టుకుని జేబులో వేసుకున్నాడు. ఆ తరువాత పంజరం రేకు తీసి గింజ రత్తికి అందించాడు. రత్తి నెమ్మదిగా నడిచి వచ్చింది. గింజ అందుకుంది. ఆ తరువాత నెమ్మదిగా అటూ ఇటూ నడుస్తూ ఎదురుగా ఉన్న కవర్లలో ఒక్కదాన్ని ముక్కుతో పట్టుకుని ఇవతలికి లాగిశివయ్య చేతికి అందించి మళ్ళీ ఒక గింజ అందుకుని నములుతూ లోపలికి వెళ్ళిపోయింది. శివయ్య ఆ కవరు తీసి లోపలి కాగితం చదివాడు. తరువాత దాన్ని ఆ యువకుడికి అందించాడు. అందులో వంకరటింకర రాతతో 'మీరనుకున్నది దిగ్విజయంగా జరుగుతుంది' అని రాసి ఉంది. ఆ యువకుడి ముఖం వెలిగింది. హుషారుగా - 'ఒరే భద్రుడూ మనవాళ్ళు నెహ్రూ కప్ గెల్చుకోవడం ఖాయంరా' అంటూ తన మిత్రుడితో కలిసి వెళ్ళిపోయాడు. వాళ్ళు వెళ్ళిపోయే ముందు ఆ రెండో యువకుడు 'నీ బొంద....వెధవ చాదస్తం నువ్వూనూ' అని అనడం శివయ్యకు వినిపించకపోలేదు. మరో పది నిముషాలలో ఒక నలభై అయిదేళ్ళ మధ్య వయస్కుడు వచ్చాడు. చింతలతో, దిగుళ్ళతో బాధలతో క్రుంగిపోయిన వాడిలాగున్నాడు. జీవితపు బండిని అతి అయాసపడుతూ కష్టపడి లాగుతున్నవాడిలా ఉన్నాడు. అతడొక రూపాయి చదివించుకుని కొంచెం కళ వచ్చిన ముఖంతో వెళ్ళిపోయాడు. ఆయన శివయ్యతో కొంతసేపు మాట్లాడాడు కూడా. ఆయన ఇంట్లో సౌఖ్యం లేదు. మంచానపడి తీసుకుంటూ చావుకోసం ఎదురుచూస్తున్న తల్లి, పెళ్ళికాని పెద్ద కూతురూ, చదువుకుంటున్న మరో కూతురూ, పోస్టుగ్రాడ్యుయేట్ అయి నాలుగేళ్ళయినా ఉద్యోగం రాని కొడుకూ, అసంతృప్తితో వేగిపోయే భార్య, ఆఫీసులో కొరుక్కుతినే విశ్వామిత్రుడి వంటి పై అధికారి, లంచాలు, మామూళ్ళు రవ్వంత అయినా గిట్టని కుర్చీ - ఇదీ అతని క్షోభ.... 'అతి త్వరలో పరిస్థితులన్నీ చక్కబడతాయి. శాంతి చిక్కుతుంది. చిక్కులన్నీ తీరిపోతాయి.' అని చదువుకుని, ఆ మానవుడు అప్పుడే తన బాధలన్నీ తీరిపోయిన వాడిలా గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

మరో పావుగంట గడిచింది. ఈ లోపల శివయ్య మళ్ళీ 'రత్తీ! ఎందుకలా ఉన్నావు?' అన్నాడు పెద్దగా. ఆ తరువాత మళ్ళీ 'ఎందుకో మగతగా మత్తుగా ఉంటున్నది' అని కూడా అనుకున్నాడు దిగులుతో. ఆ తరువాత ఒక నడివయసు స్త్రీ వచ్చింది. ఆమె చేతిలో క్యారియర్....మరో చేతిలో ఒక ప్లాస్టిక్ బుట్ట ఉన్నాయి. బహుశా వెనకనే ఉన్న హాస్పిటల్‌కు వెళుతూ ఉండాలి. ఆమె ఆగి గోడకు ఆనించి ఉన్న బోర్డు అంతా చదివి, చేతిలో వస్తువులు క్రింద ఉంచి 'ఎంత?' అని అడిగింది.

'రూపాయేనమ్మా!' అన్నాడు శివయ్య.

'అమ్మో! రూపాయే' అన్నదావిడ.

శివయ్య 'రూపాయికి ఏమొస్తున్నది తల్లీ ఈ రోజుల్లో....' అన్నాడు.

ఆమె తన మనసులో అనుమానం తీర్చుకుందామని నిలబడింది. తీరా కవరు లోని విషయం చదువుకుని మరింత దిగాలు పడినదానిలా డీలా పడిపోయి నీరసంగా నడిచి వెళ్ళిపోయింది.

సూర్యుడు నడినెత్తిమీదకు రాగానే శివయ్యకు కడుపులో నిప్పుల చక్రం తిరుగుతున్నట్టు అనిపించింది. ఎదురుగానే ఉంది ఒకమోస్తరు హోటలు. కర్ర చంకన పెట్టుకుని అక్కడకి వెళ్ళి తన సరంజామా అంతా కనిపించేలా అనువైన చోట కూర్చుని చల్లారిపోయిన కుడుముల్లాంటి రెండిడ్లీలు వేడి వేడి సాంబారుతో సేవించి, టీ నీళ్ళు తాగి ఇవతలికి వచ్చాడు. సూర్యుడు ఆ వెనక కొండల క్రింద దిగిపోతున్నాడు. ఆఫీసులు, స్కూళ్ళు, కాలేజీలు వొదిలేవేళ.... మ్యాటినీలు ముగిసే వేళ.... మొదటి ఆటలు మొదలయ్యేవేళ అతనికి గిరాకీ పెరిగింది. నలుగురైదు గురు చొప్పున మూగారు. ఒకరి తర్వాత ఒకరు తమ మనసులో ఉన్న బాధను, అనుమానాలను తీర్చుకున్నారు. వెళ్ళిపోయారు.

శివయ్య పొద్దుగూకేవేళకు అంచనా వేసుకుంటే ఇవాళ ఫరవాలేదనిపించింది. ఒక విధమైన సంతృప్తి కలిగింది. చీకటి పడుతున్నది. వీధిలైట్లు వెలిగాయి. ఆ లైట్ల చుట్టూ చిన్నసైజు మబ్బు లావరించినట్టు పురుగులు చేరాయి.

శివయ్య మొత్తం సర్దుకున్నాడు. రైలుకు వ్యవధి ఉంది కదా అని అయిదు నిమిషాలసేపు విశ్రాంతిగా కూర్చుని బీడీ కాల్చాడు.

ఆ తరువాత పంజరం అందుకుని మిగిలిన సామాను వీపున కట్టుకుని, కర్ర కొట్టుకుంటూ ముందుకు అడుగులు వేశాడు.

స్టేషను చేరుకొని లోపలికి వెళుతుండగా గేటుపక్కనే ఉన్న టి. సి. ఎవరి

తోనో మాట్లాడుతూ అతన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత ప్లాట్‌ఫారం చివరగా గోడకానుకొని కూలబడ్డాడు. పక్కనే వున్న పంజరంలోకి చూస్తూ వుండిపోయాడు. దాని ఒంట్లో ఏ మాత్రం సత్తువ ఉన్నట్టు లేదు. కూలబడిపోతున్నది. నిలబడలేక పోతున్నది. శివయ్య చూపులు దానిమీదనే నిలిచిపోయాయి. తరువాత తలుపుతీసి దాన్ని చేతిలోకి తీసుకొని జాగ్రత్తగా పరికించాడు. అతనికి భయం వేసింది. వున్నట్టుండి వెన్నులోంచి వణుకు బయలుదేరింది. కళ్ళనెంట నీళ్ళొచ్చాయి. 'దీని పని అయిపోతున్నది' అనుకున్నాడు. మంచంలోని ఆప్తబాంధవుడు, తిండి పెట్టినవాడు, కరుణ నిండిన హృదయం కలవాడు చచ్చిపోతూ ఉంటే పక్కనే ఉన్నవాడి కెలా అనిపిస్తుంది? అలా శివయ్య క్షోభ పడిపోయాడు.

తన చేతులకు తెలుస్తున్నది. తన మనసుకు తెలుస్తున్నది. మృత్యువు చల్ల చల్లగా సమీపిస్తున్నది. నెమ్మనెమ్మదిగా కబళిస్తున్నది. శివయ్య బరువెక్కిన మనసుతో దాన్ని మళ్ళీ పంజరంలో ఉంచాడు. తరువాత కళ్ళు తుడుచుకున్నాడు.

అంతలో ఆనాడు చాలా యేళ్ళ క్రిందట.... యుద్ధంలో తన పక్కనే.... గుండు దెబ్బతిని గప్ చుప్‌గా తల వాల్చిన హమీద్ గుర్తుకు వచ్చాడు. తరువాత గుండె దెబ్బ తగిలిన తన కాలిని మిలటరీ హాస్పిటల్‌లో తీసివేసిన డాక్టర్ ముఖం గుర్తుకు వచ్చింది. కాలులేక మంచంలో పడివున్న తనను చూసి ఘోరుమని ఏడ్చిన భార్య ముఖం గుర్తుకు వచ్చింది. చివరకు వర్షం ధారగా కురుస్తున్న ఒకనాటి అసుర సంధ్యవేళ చనిపోతూ తన వంక చూసిన ఆమె కళ్ళు గుర్తొచ్చాయి.

రైలువచ్చింది. శివయ్యరైలెక్కి తలుపు పక్కగా సర్దుకుని కూర్చున్నాడు. చేతిని పంజరం మీదే ఉంచాడు.

అయిదు నిమిషాలలో రైలు పొడవాటి నది వంతెనమీద చప్పుడు చేస్తూ నడిచింది. శివయ్య పంజరంమీద చేయి తియ్యకుండా అలాగే కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

అంతలో 'ఏయ్! టిక్కెట్టు తియ్' అని గర్జన వినబడి ఉలిక్కిపడ్డాడు.

ఎదురుగా భారీ శరీరం.... ఆ ఎర్రని కళ్ళలో 'దొంగను పట్టుకున్నా'నన్న గర్వం.... అతడు దీనంగా 'టికెట్ కొనలేదు బాబయ్యా! ఇప్పుడే దిగిపోతాను' అన్నాడు.

'ఇప్పుడే అంటే రైల్లోంచి దూకి దిగిపోతావా? అలాగే ఇప్పుడే దిగు....' ఆ మాటల్లో వ్యంగ్యం.

అదివిని ఎవరో నవ్వారు.

టి. సి. పుస్తకం తీశాడు.

'ఎక్కణ్ణించి ఎక్కడికి?'

శివయ్య చెప్పాడు.

టి. సి. లెక్కవేసి 'పదిహేను రూపాయలు కట్టు' అన్నాడు. 'కక్కు' అన్నట్టు వినిపించింది శివయ్యకు.

పై జేబులో ఎనిమిది రూపాయలు ఉన్నాయి. బనీను లోపలి జేబులో మిగిలిన డబ్బు వున్నది. ఎనిమిది తీసి 'ఇంతే వున్నది బాబూ! వచ్చే స్టేషన్లో దిగిపోతాను' అన్నాడు.

నవ్వులు.

'దిగిపోతాన్లెండి'

టి. సి. డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు.

శివయ్య నిజాయితీగా ఇవతలి స్టేషన్‌లో దిగాడు. అక్కడి నుంచి మూడు మైళ్ళు నడవాలి.

రైలు వెళ్ళిపోయింది. శివయ్య నడక ప్రారంభించాడు. చిమ్మచీకటి....చుట్టూ కీచురాళ్ళ రొద.... సన్నని మట్టిబాట కటూ ఇటూ చిట్టడవి.... దాన్నిండానూ చిమ్మచీకటి....

అతడొక చోట ఆగాడు....

పంజరం కింద ఉంచి కూలబడ్డాడు. దాని తలుపు తీశాడు. రత్తిని చేతి లోకి తీసుకున్నాడు. అది అతని చేతిని కౌగిలించుకున్న దానిలా గట్టిగా పట్టుకుంది. అతడు ఉన్నట్టుండి ఏడ్చాడు.

"తల్లీ రత్తమ్మా! మూడేళ్ళు ఈ కుంటోడికి తిండి పెట్టావు. ఇప్పుడు చచ్చి పోతున్నావు. నా దగ్గర చచ్చిపోవద్దు. వెళ్ళిపో. ఓపిక ఉన్నంత దూరం వెళ్ళు.... అక్కడెక్కడో చచ్చిపో....!"

దాన్ని బతిమాలుతూ వదిలిపెట్టాడు. అది ఒక అడుగు వేసింది. తూలింది. మరో అడుగు వేసింది. మళ్ళీ తూలింది. అలాగే తూలుతూ అడుగులువేసి క్రమంగా చీకట్లో కలిసిపోయింది.

శివయ్య చాలాసేపు దయ్యం పట్టిన వాడిలా కూర్చున్నాడు. ఆ తరువాత ఆ కవర్లు అన్నీ తీసి పోగు పెట్టాడు. అగ్గిపుల్ల గీసి అంటించాడు. నెమ్మది నెమ్మదిగా అన్నింటినీ ఎగసన తోసి బూడిద చేశాడు. ఒక్క ముక్క కూడా మిగలనీయలేదు.

ఆ తరువాత చేతికర్ర అందుకుని భుజం క్రింద ఉంచుకొని నెమ్మది నెమ్మదిగా అడుగులు వేస్తూ చీకటిలో సాగిపోయాడు.

*